క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేత అశోక్‌కు ఘన నివాళి



అశోక్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ద్వారకాతిరుమల: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కళ్ల చెరువుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత మేడవరపు అశోక్‌కు వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల నాయకులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత ఏసుబాబు, అంబటి గాంధీ, ఉక్కుర్తి వెంకట్రావు, బొండాడ సాత్యకిరావు, పానమాల ఉమామహేశ్వరరావు, రుద్ర శివాజీ, దూలపల్లి ప్రసాద్ తదితరులు కళ్లచెరువులోని అశోక్ నివాసం వద్ద ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడికి పరామర్శ



సీతంపేటలో సూర్యరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గురునాథరావు

కొయ్యలగూడెం: బయ్యనగూడెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట జయబాబును వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గం పరిశీలకులు జెట్టి గురునాథరావు గురువారం పరామర్శించారు. ఇటీవల జయబాబు తండ్రి వైఎస్సార్ సీపీ రైతు నాయకుడు సూర్యరావు గుండెపోటుతో మృతి చెందారు. సీతంపేటలో జయబాబు నివాసానికి గురునాథరావు వెళ్లి ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. సూర్యారావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సర్పంచ్ తోటకూర పద్మావతి, తోటకూర శ్రీను, కేదాసు శ్రీను, మధ్యాహ్నపు ఏసు, కేదాసు రామకృష్ణన్, తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో ప్రారంభోత్సవాలు



సాలిపేట రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో నిర్మాణం పూర్తయిన పలు రోడ్లను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ గురువారం ప్రారంభించారు. స్థానిక బుట్టాయగూడెం రోడ్డు, పాత సంతమార్కెట్ నుంచి రావూరి జంక్షన్ వరకు వేసిన సీసీ రోడ్డు, మున్సిపల్ కార్యాలయ భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్మించిన అదనపు గదులను, మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, కౌన్సిలర్లు, కమిషనర్ జె.నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు సదస్సు



మాట్లాడుతున్న సూర్యనారాయణ

ద్వారకాతిరుమల: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు సదస్సు నిర్వహించనున్నట్టు ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్రాపు సూర్యనారాయణ తెలిపారు. 27 నుంచి మూడు రోజులపాటు రాష్ట్ర రైతు శిక్షణ తరగతులను నిర్వహిస్తామని వెల్లడించారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో గురువారం ఏర్పాటుచేసిన రైతు సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో సూర్యనారాయణ మాట్లాడుతూ 27న ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమలలోని శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో వ్యవసాయ సంక్షోభం – మద్దతు ధరలు అంశంపై రాష్ట్ర రైతు సదస్సు ఏర్పాటుచేశామన్నారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 200 మంది రైతు ప్రతినిధులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు, వ్యవసాయ రంగ నిపుణులు పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడి సాగు చేస్తున్న పంటలకు కనీస ధరలు రాక, ప్రకృతి వైపరీత్యాల వల్ల, పెట్టుబడి విపరీతంగా పెరిగిపోయి అన్నదాతలు నష్టపోతున్నారని వివరించారు. ఈ పరిస్థితుల్లో రైతు రక్షణ, వ్యవసాయ పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తన వంతు కృషి చేస్తుందని, తోడ్పాటు అందించాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి



పట్టెన్నపాలెంలో మొక్కను నాటుతున్న పొగాకు బోర్డు అధికారులు



కొయ్యలగూడెం : రామన్నగూడెంలో మొక్కలు అందుకున్న రైతులు



చింతలపూడి : యర్రగుంటపల్లి హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలని స్థానిక పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ అధికారి దామోదర్, ఎస్ఎల్ఎస్ ఆర్ఎం జీఎల్‌కే ప్రసాద్‌లు అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెంలో గురువారం ఏక్‌పేడ్ మాకే నామ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కన్నతల్లి పేరున ఒక చెట్టు నాటాలని కోరారు. తద్వారా పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1 అధికారి బి.శ్రీహరి, సీనియర్ గ్రేడింగ్ అధికారి కె.సుధీర్, ఫీల్డ్ అసిస్టెంట్ బి.బుచ్చయ్య, పట్టెన్నపాలెం పొగాకు రైతులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

కొయ్యలగూడెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కను నాటి సంరక్షించాలని స్థానిక పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి ఎం గ్రేస్ మార్గరేట్ అన్నారు. మండలంలోని రామన్నగూడెంలో కొయ్యలగూడెం పొగాకు బోర్డు వేలం కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏక్ పేడ్ మాకే నామ్ పేరుతో రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి రైతుకు 5 చొప్పున కలపనిచ్చే మొక్కలు అందించి, వారితో నాటించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బంది రామన్నగూడెం రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములు కండి

చింతలపూడి: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ తుల్లిమిల్లి రాణి అన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు గురువారం యర్రగుంటపల్లి పాట్టి మాణిక్యం హైస్కూల్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల శుభ్రత, తడి, పొడి చెత్త, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్ఎం బాబూరావు, ఎంపీటీసీ విజయ భాస్కర్, ఉప సర్పంచ్ వి వెంకటరెడ్డి, పంచాయితీ కార్యదర్శి నాగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

లింగపాలెం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో అందరూ భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ జె.రత్నకుమార్ అన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గురువారం లింగపాలెంలో రత్నకుమార్ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లింగపాలెం పంచాయతీ కార్యాలయం, పరిసర ప్రాంతాలను పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో లింగపాలెం సచివాలయం సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కామవరపుకోట: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని ఎంఈఓ డి.సుబ్బారావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేముల నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, స్కౌట్ ఉపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, బి.ఏడుకొండలు, సచివాలయం సిబ్బంది, పుష్పావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: స్థానిక మెట్టమీద సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, లైన్ ఏర్పాటు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో అశ్వారావుపేట రోడ్డు, కాలేజీ రోడ్డు, సాలిపేట, ఉప్పలమెట్ట, సుబ్బారెడ్డి కాలనీ, రాజుల కాలనీ, బైపాస్ రోడ్డు, శ్రీనివాదాపురం రోడ్డు ఏరియాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. లక్కవరం సబ్ స్టేషన్ పరిధిలో లక్కవరం, దేవులపల్లి, పుట్లగట్ల గూడెం, గురవాయిగూడెం, నాగులగూడెం, ఆమ్మపాలెం గ్రామాల్లో మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ ఇతర అన్ని రకాల వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

దిప్పకాయపాడులో..

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఈఈ రాధాకృష్ణ తెలిపారు.

డ్రెయిన్ సరిగా లేక ఇబ్బందులు

పోలవరం రూరల్: పోలవరం మండలం పాత కుంకాల గ్రామంలో డ్రెయిన్ వ్యవస్థ సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాత కుంకాల గ్రామంలో టీటీడీ ఆధ్వర్యంలో గతంలో నిర్మించిన రామాలయం ఎదురుగా ఉన్న పంచాయతీ డ్రెయిన్ శిథిలావస్థకు చేరడంతో పాటు సిల్ట్ పేరుకుపోయి నీరు పారే పరిస్థితి లేదు. దీంతో దుర్గంధం వెదజల్లి ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను గ్రామ పంచాయతీకి తెలియజేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆలయ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి తెలిపామని కమిటీ సభ్యులు కలుం ధర్మరాజు, కొక్కెర సుజాత తదితరులు వివరించారు.

మంచినీటి సరఫరా కార్మికుల వినతి

జంగారెడ్డిగూడెం: మెట్ట ప్రాంత ప్రజల దాహార్తి తీరుస్తున్న శ్రీ సత్యసాయి బాబా గోదావరి మంచినీటి సరఫరా కార్మికులు తమ సమస్యలను డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. జంగారెడ్డిగూడెంలో గురువారం సత్యసాయి వాటర్ స్కీమ్ కార్మికులు రాంబాబును కలిశారు. ఏడు నెలలుగా జీతాలు రావడం లేక ఇబ్బందులు పడుతున్నామని, పలు సమస్యలపై రాంబాబుకు విన్నవించారు. సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మామిడిపల్లి ప్రసాద్, సతీష్, బాలాజీ, వీరబాబు, చాటపర్తి పోసిబాబు, రమేష్‌లు పాల్గొన్నారు.

రచయిత తాపీ ధర్మారావుకు నివాళి

కొయ్యలగూడెం: తెలుగు భాషా పండితుడు తాపీ ధర్మారావు 137వ జయంతి కార్యక్రమం కుంతలగూడెం ఎంపీపీ స్కూల్లో గురువారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో చిన్నారులు ధర్మారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వెండి కిరీటం బహూకరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయ దుర్గమ్మవారి ఆలయానికి వెండి కిరీటం సమకూరింది. ఆలయంలోని విఘ్నేశ్వరుని ఉత్సవ విగ్రహానికి 100 గ్రాముల వెండి కిరీటాన్ని మహంకాళి పవన్ రాజేష్ దంపతులు, మహంకాళి రూపేష్ దంపతులు అందజేసినట్టు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు.

మహిళలకు ఈ నెల 23 నుంచి ఉచిత శిక్షణ

కామవరపుకోట: ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో కామవరపుకోట మండలం తడికలపూడిలోని ఎన్‌టీఆర్ నైపుణ్యాభివృద్ధి మహిళా ప్రాంగణంలో యువత, మహిళలకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, ఎంబ్రాయిడరీ (మగ్గం వర్క్) కోర్సుల్లో ఈ నెల 23 నుంచి శిక్షణ ఇవ్వనున్నట్టు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ బి.రెబకా శామ్యూల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస విద్యార్హత 8వ తరగతి పాసై, 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయసు ఉండాలని, విద్యార్హత, ఆధార్ ధ్రువీకరణ, రేషన్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో తడికలపూడి మహిళా ప్రాంగణంలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

సామూహిక సీమంతాలు



టి.నరసాపురం : పౌష్టికాహార మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కామవరపుకోట: తడికలపూడిలో నిర్వహించిన సామూహిక సీమంతం

కామవరపుకోట: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులకు స్థానిక దాతల సహకారంతో గురువారం తడికలపూడి అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తడికలపూడి ఏరియా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్ వీరకుమారి మాట్లాడుతూ గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కామవరపుకోట ఏరియా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి, తూత లక్షణరావు, అంజియ్య, పావులూరి గాంధీ, కొత్తపల్లి శ్రీను, యర్రోజు శివాజీ, మోటేపల్లి రామకృష్ణ, సింగవరపు హరీష్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవ ర్యాలీ

టి.నరసాపురం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ పి.మాధవి అన్నారు. టి.నరసాపురం జెడ్పీహెచ్ స్కూల్‌లో పోషణ మాసోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. 9, 10 తరగతి బాలికలకు రక్తహీనత, పౌష్టికాహారం గురించి సీడీపీఓ అవగాహన కల్పించారు. విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

కుక్కునూరు: అంగన్‌వాడీ సెంటర్లలో ఇచ్చే బాలసంజీవని కిట్ గుడ్లు, పాలను వినియోగించుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.మయూరి అన్నారు. గురువారం కుక్కునూరు క్లస్టర్ పరిధిలోని వింజరం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలుండే ఆహారాన్ని తీసుకోవాలని మయూరి గర్భిణులకు సూచించారు. పోషకాహార విలువుల కలిగిన స్టాల్స్ ను ఏర్పాటు చేసి వివరించారు. కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులు, అంగన్‌వాడీ, పాఠశాల టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరిస్తే ఆస్పత్రిపాలవ్వాల్సిందే!



కోతకు గురైన రోడ్డు మార్జిన్ వద్ద హెచ్చరికగా రాళ్లు పెడుతున్న స్థానికులు, రోడ్డు కోతకు గురైన ప్రాంతం (అంతరచిత్రం)



జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం నుంచి పంగిడిగూడెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో అనేక ప్రాంతాల్లో మార్జిన్ కోతకు గురైంది. మార్జిన్‌లో మట్టి కొట్టుకుపోయి పెద్దపెద్ద గోతులుగా ఏర్పడ్డాయి. ఏమాత్రం వాహనచోదకులు ఆదమరిచినా గాయపడి ఆస్పత్రిపాలవక తప్పదు. రాత్రి వేళలో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు కొడమ పద్మరాజు, పూల శ్రీను, మల్లెల్లి సూర్యనారాయణలు ఆందోళన చెందుతున్నారు.

– జంగారెడ్డిగూడెం రూరల్

గ్రామీణుల ఆసక్తిని పెంచేలా క్రీడా పోటీలు



చింతలపూడిలో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ కిరణ్ బాబు

చింతలపూడి : గ్రామీణ క్రీడా కారుల్లో ఆసక్తిని పెంచేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 కిరణ్ బాబు తెలిపారు. స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం ఆటల పోటీలను ఎంఈఓ కిరణ్‌బాబు ప్రారంభించారు. 19, 20, 21 మూడు రోజుల పాటు అండర్-16, -17 విభాగాల్లో నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ తెలిపారు. 13 హైస్కూల్స్‌కు చెందిన సుమారు 800 మంది క్రీడా కారులు పాల్గొంటున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయులు, నియోజకవర్గ కోఆర్డినేటర్ పిట్లా వేణు తెలిపారు. గురువారం లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, జావాలిన్ త్రో, పరుగు పందాలు , 20వ తేదీన వాలీ బాల్, యోగ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, 21 న కబడ్డీ, ఖోఖో, చెస్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 జి.రామారావు, మండల క్రీడా కోఆర్డినేటర్ సీమోను, నియోజకవర్గం లోని పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకు శిక్షణ

ఏలూరు(మెట్రో): వ్యవసాయంలో పురుగు మందులు, రసాయనిక ఎరువుల వినియోగం, సాగు ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన ఉత్పత్తులను పండించడం చాలా అవసరమని ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా అన్నారు. గురువారం ఏలూరు ఐఏడీపీ హాల్‌లో వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులకు మేలైన సాగు యాజమాన్య పద్ధతులు (జీఏపీ) పొలంబడి, ఇండిగాప్ సర్టిఫికేషన్ పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హబీబ్ బాషా మాట్లాడుతూ సాగు ఖర్చులు తగ్గించుకుని, నాణ్యమైన ఉత్పత్తులను ఐఎన్‌డీ జీఏపీ పొలంబడి ద్వారా సాధ్యం చేయవచ్చన్నారు. వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీఏ వెంకటేశ్వర్లు జీఏపీ పొలంబడి, ఐఎన్‌డీ జీఏపీ సర్టిఫికేషన్, మాన్యువల్ తయారీని వివరించారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏఓ లక్ష్మీరెడ్డి ఫార్మర్స్ డైరీలు రాసే విధానాన్ని తెలియజేశారు. ఏపీఎస్‌ఓపీసీఏ సీనియర్ ఆఫీసర్ ప్రతాప్ రెడ్డి, క్యూఎంఎస్ ఆడిట్ చెక్ లిస్ట్ తయారు చేయుట, సీపీసీసీ చెక్ లిస్ట్ లోని మోడల్స్ గురించి వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వారి కార్యాలయపు ఏడీఏ, ఏఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి



ఏలూరు జిల్లా నూతన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

ఏలూరు టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల ఆరోగ్య సంరక్షణకు విశేష సేవలందిస్తోన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సూపర్‌వైజర్లుగా పదోన్నతులు కల్పించాలని ఉమెన్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు వీకేఎస్ జయలక్ష్మి డిమాండ్ చేశారు. స్థానిక ఏపీ ఎన్‌జీవో భవనంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యవర్గ సమావేశంలో ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.నాగమణి, ఉపాధ్యక్షురాలిగా కె.పద్మజ, ఎన్ రేణుక, కార్యదర్శిగా వీవీ నాగలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా టి.ధనలక్ష్మి, ట్రెజరర్ జె.మరియమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దవగల్ని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా ఎలాంటి పదోన్నతులు లేకుండా మల్టీమర్పస్ హెల్త్ అసిస్టెంట్లుగానే మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్లుగా పదోన్నతుల కల్పించేందుకు జీఓ 143ను అమలు చేయాలని కోరారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక పీహెచ్ఎన్‌ను నియమించాలన్నారు. నూతన అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ జీఓ 115 అమలు చేయాలని, ఏఎన్ఎం నుంచి శిక్షణ పొందిన వారిని వెనక్కి పంపటం సరికాదన్నారు. వారికి జీఎన్ఎం పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు ఏఎన్ఎంలే కీలకమని చెప్పారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు ఎంవీ సావిత్రి, కార్యదర్శి కేఎస్ఎస్ కుమారి, జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన సంఘం కార్యకర్తలు ఉన్నారు.

విర్డ్‌లో 23, 24 తేదీల్లో వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈనెల 23, 24 తేదీల్లో ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కర ఆనంద్ కుమార్‌చే ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆస్పత్రి ట్రస్టు చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ఈ శిబిరంలో పుట్టుకతో వచ్చిన చేతి సమస్యలు, పోలియో, అన్ని రకాల చేతి సమస్యలకు చికిత్స చేయనున్నట్టు చెప్పారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో నిర్దేశించిన వైద్య సేవలను ఉచితంగా అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు 83744 45108, 79016 95176కు సంప్రదించాలని సూచించారు.

సీసీఎస్ ఎస్సై మృతికి సంతాపం

ఏలూరు టౌన్: ఏలూరు సీసీఎస్ ఎస్సై డి.నరసింహారావు గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ గురువారం సందర్శించి, పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నరసింహారావు భార్య పద్మావతి, కుమారులు సీతారాం, సుందర్‌కు ఎస్పీ ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.

ఘనంగా గణపతి ఉత్సవాలు



కొయ్యలగూడెం టేకు తోట గణపతి లడ్డూలకు వేలం నిర్వహించిన దృశ్యం



నిమజ్జనానికి తరలివెళుతున్న వినాయకుని విగ్రహం

కొయ్యలగూడెం: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా 13వ రోజు గణపతి ప్రతిమల ఊరేగింపులు, అన్న సమారాధనలు, లడ్డూల వేలంపాట ప్రక్రియలు నిర్వహించారు. టేకు తోట వినాయకుడి శిబిరం వద్ద రెండు వేల మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. స్వామివారి ప్రతిమను కోలాటం నృత్య ప్రదర్శనల నడుమ ఊరేగించారు. కన్నాపురం, బయ్యనగూడెం, రాజవరం, పరింపూడి గ్రామాల్లో ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

గంగ చెంతకు గణనాథులు

పోలవరం రూరల్: పోలవరం గ్రామంలోని పాత పోలవరం, గణేష్ నగర్, పైడిపాక ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలను పోలవరం గ్రామంలో ట్రాక్టర్లపై ఉంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు డీజే సౌండ్ నడుమ భారీగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పట్టిసీమ గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమాన్ని రెవెన్యూ, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.